జాతీయ దిన పత్రిక
# తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..
https://tholivelugu.com/




మమతా బెనర్జీని ఆమె నియోజకవర్గంలో
## సువేందు ఓడించారు: అమిత్ షా



- టీఎంసీ ఓటమితో రాష్ట్రంలో అరాచక పాలన ముగిసిపోయిందన్న కేంద్రమంత్రి
- బెంగాల్‌లో బీజేపీ అద్భుత విజయం సాధించిందని వ్యాఖ్య
- అభివృద్ధితో పాటు హామీలు నెరవేర్చే బాధ్యత బీజేపీపై ఉందని వ్యాఖ్య

**స్టార్ త్రినేత్రం, జాతీయం:** తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీని తమ పార్టీ నాయకుడు సువేందు అధికారి ఆమె సొంత నియోజకవర్గంలో ఓడించారని కేంద్రమంత్రి అమిత్ షా అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ, బెంగాల్ ఐదు దశాబ్దాల పాటు ప్రజాస్వామ్య క్షీణత, శాంతిభద్రతల పతనంతో తీవ్ర సమస్యను ఎదుర్కొందని అన్నారు. ఇప్పుడు టీఎంసీ ఓటమితో రాష్ట్రంలో అరాచక పాలన ముగిసిపోయిందని వ్యాఖ్యానించారు.

లో



## కేటీఆర్‌లా దోచుకోవడం, దాచుకోవడం తెలియదు: బండి సంజయ్ ఆగ్రహం

- బీఆర్ఎస్ హయాంలో రైతులకు బేడీలు వేసి ఇబ్బందులకు గురి చేశారన్న బండి సంజయ్
- అలా హింసించడం తమకు తెలియదన్న బండి సంజయ్
- వారిలా డ్రగ్స్ తీసుకోవడం తనకు తెలియదని వ్యాఖ్య

## ఇండోనేషియాలో బద్దలైన అగ్నిపర్వతం... ముగ్గురి మృతి

## మూసీ సుందరీకరణకు ముహూర్తం ఫిక్స్.. తొలిదశలో రూ.7,055 కోట్లతో పనులు

- మూసీ సుందరీకరణకు ముహూర్తం ఫిక్స్
- ఆగస్ట్ నుంచి మూసీ ప్రాజెక్టు పనులు ప్రారంభం
- తొలిదశలో రూ. 7055 కోట్లతో పనులు





## విజయ్‌కి మళ్లీ షాకిచ్చిన గవర్నర్..

- ప్రమాణ స్వీకారం లేనట్లే.. తమిళనాట వీడని ఉత్కంఠ!
- తమిళ రాజకీయాల్లో మరో ట్విస్ట్
- కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం ఇచ్చినట్లే కనిపించినా..
- చివరి నిమిషంలో విజయ్‌కి గవర్నర్ షాక్
- నేటి విజయ్ ప్రమాణ స్వీకారంపై సందిగ్ధత

లో

**స్టార్ త్రినేత్రం, చెన్నై:** సీకే పార్టీ నుంచి మద్దతు లేఖ రాకపోవడంతో పాటు.. ఐయూఎంఎల్ పార్టీ లేఖలో స్పష్టత లేకపోవడంతో.. ప్రమాణ స్వీకారానికి గవర్నర్ అధికారికంగా ఆమోదం కల్పించకపోవడంతో.. ఇప్పుడు ప్రభుత్వ ఏర్పాటుపై ఉత్కంఠ వీడటం లేదు. తమిళ రాజకీయాలు మరోసారి రసవత్తరంగా మారాయి. కాంగ్రెస్, వీసీకే, సీపీఐ, సీపీఎం, ఐయూఎంల్ వంటి పార్టీలతో సుదీర్ఘ మంతనాల తర్వాత ఆ పార్టీలు మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించగా.. వారు ఇచ్చిన లేఖలతో గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్‌ను విజయ్ నేతృత్వంలోని టీవీకే నేతలు కలిశారు.



## తెలంగాణ వ్యాప్తంగా హైడ్రా విస్తరణకు ప్రభుత్వం నిర్ణయం.. కమిషనర్ రంగనాథ్

- రాష్ట్రవ్యాప్తంగా హైడ్రా విస్తరణ!
- కమిషనర్ రంగనాథ్ వెల్లడి
- ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్న కమిషనర్

**స్టార్ త్రినేత్రం, హైదరాబాద్:** తెలంగాణ అంతటా హైడ్రాను విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఈ విషయాన్ని హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా హైడ్రాకు వినతులు వస్తున్నాయని.. ఈ నేపథ్యంలో హైడ్రా పరిధిని రాష్ట్రమంతటా విస్తరించాలని నిర్ణయించినట్లు వివరించారు. గురువారం నల్గొండ జిల్లాలో పర్యటించిన హైడ్రా కమిషనర్.. ఈ విషయాన్ని వెల్లడించారు. ఇప్పటి వరకూ కోట్ల విలువైన భూములను కబ్జాదారుల చెర నుంచి హైడ్రా కాపాడినట్లు వివరించారు.

లో



## రియల్ ఎస్టేట్ రంగంలో టెక్నాలజీ విప్లవం.. ఏఐ వాడకంలో భారీ పెరుగుదల

2047 నాటికి భారత రియల్ ఎస్టేట్ మార్కెట్ 9 రెట్లు పెరుగుతుందని అంచనా

- 5.8 ట్రిలియన్ డాలర్లకు చేరుతుందని ఫిక్కీ-కేపీఎంజీ సంయుక్త నివేదిక
- వృద్ధికి కీలకంగా మారనున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఇతర సాంకేతికతలు
- ప్రస్తుతం జీడీపీలో 7.3 శాతంగా ఉన్న రియల్టీ రంగం వాటా
- పెరుగుతున్న ఖర్చులు, నిబంధనల వల్లే టెక్నాలజీ వినియోగం తప్పనిసరి

లో



లో




జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..

## మమతా బెనర్జీని ఆమె నియోజకవర్గంలో సువేందు ఓడించారు: అమిత్ షా

బీజేపీ బెంగాల్‌లో అద్భుత విజయం సాధించిందని అమిత్ షా అన్నారు. ఈ విజయం అసాధారణమని, బెంగాల్ చరిత్రలోనే కీలక మలుపు అన్నారు. ప్రచారం సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చే బాధ్యత ఇప్పుడు బీజేపీ పైనే ఉందని స్పష్టం చేశారు. బెంగాల్ అభివృద్ధి బాధ్యత తమపైనే ఉందని అన్నారు.

రాష్ట్రంలో పోలింగ్‌ను శాంతియుతంగా నిర్వహించారంటూ ఎన్నికల సంఘం, భద్రతా దళాలు, రాష్ట్ర అధికారులను అమిత్ షా అభినందించారు. కాంగ్రెస్ పార్టీ వరుసగా ఎన్నికల్లో ఓడిపోతోందని అన్నారు. ఎందుకు ఓడిపోతున్నామో ఆ పార్టీ ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. ఆత్మపరిశీలన చేసుకోని నాయకులు ఎప్పటికీ నిజమైన విజయాన్ని అందుకోలేరని అమిత్ షా అన్నారు.

## కేటీఆర్‌లా దోచుకోవడం, దాచుకోవడం తెలియదు: బండి సంజయ్ ఆగ్రహం

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేటీఆర్‌లా దోచుకోవడం, దాచుకోవడం తనకు తెలియదని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో రైతులకు బేడీలు వేసి ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారని, అలా హింసించడం తనకు తెలియదని అన్నారు. వారిలా డ్రగ్స్ తీసుకోవడం కూడా తనకు తెలియదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కాళేశ్వరం, ఫార్ములా ఈ రేస్ కేసు, విద్యుత్ కొనుగోళ్లలో అవినీతి చేయడం తమకు తెలియదని ఎద్దేవా చేశారు. కేటీఆర్ నోరు అదుపులో పెట్టుకోవాలని లేదంటే పరిస్థితులు మరోలా ఉంటాయని హెచ్చరించారు. వారి అహంకారం వల్లనే కేసీఆర్ ఓడిపోయి ఫామ్ హౌస్?కు పరిమితమయ్యారని వ్యాఖ్యానించారు. వరుస ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెబుతున్నప్పటికీ కేటీఆర్‌లో మార్పు రావడం లేదని వ్యాఖ్యానించారు.

పరేడ్ మైదానంలో ఈ నెల 10వ తేదీన జరగబోయే ప్రధాని నరేంద్రమోదీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. తకేంద్రం నిధులివ్వకపోతే తెలంగాణ అభివృద్ధి చెందుతుందా అని ప్రశ్నించారు.

తెలంగాణ అభివృద్ధి కోసం మేం ఢిల్లీ నుంచి నిధులు తెస్తుంటే, కాంగ్రెస్ వాళ్లు మాత్రం ఇక్కడి నిధులను అధిష్ఠానానికి పంపుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీని నడుపుకోవడానికి తెలంగాణ సొమ్ము ఉపయోగించుకుంటున్నారని ధ్వజమెత్తారు. డబుల్ ఇంజిన్ సర్కారుతో తెలంగాణ మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు. మోదీ తెలంగాణ అభివృద్ధి కోసమే వస్తున్నారని బండి సంజయ్ అన్నారు.

## తెలంగాణ వ్యాప్తంగా హైడ్రా విస్తరణకు ప్రభుత్వం నిర్ణయం.. కమిషనర్ రంగనాథ్

రాష్ట్రవ్యాప్తంగా హైడ్రాను విస్తరించాలని.. తెలంగాణ సర్కారు నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఈ విషయాన్ని హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్వయంగా వెల్లడించారు. నల్గొండ జిల్లా మిర్యాలగూడలో రంగనాథ్ గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడిన ఆయన.. రాష్ట్రవ్యాప్తంగా హైడ్రా సేవలు విస్తరించాలంటూ ప్రజల నుంచి వినతులు ఎక్కువగా వస్తున్నాయని రంగనాథ్ అన్నారు. ఈ నేపథ్యంలో హైడ్రాను రాష్ట్రమంతా విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని వెల్లడించారు. హైడ్రాకు కబ్జాలపై వేలాదిగా ఫిర్యాదులు వస్తున్నాయని.. ఆ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఈ క్రమంలోనే నాలుగు వారాలు ప్రజావాణిని రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. హైడ్రాకు ఇప్పటికే చాలా ఫిర్యాదులు, దరఖాస్తులు వచ్చాయని వాటిని పరిష్కరించడం కోసమే నాలుగు వారాలు ప్రజావాణి కార్యక్రమం రద్దు చేసినట్లు రంగనాథ్ వివరించారు. హైడ్రాకు వ్యతిరేకంగా కొంతమంది న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నారని పేథ?కనారు. మరోవైపు హైడ్రా చర్యల కారణంగా ఇప్పటి వరకూ సుమారుగా రూ. 85 వేల కోట్ల విలువైన భూములను కబ్జాల నుంచి కాపాడామని రంగనాథ్ వెల్లడించారు. మరో సంవత్సరంలోగా రూ.లక్ష కోట్లు విలువైన భూములను కాపాడుతామని స్పష్టం చేశారు. కేవలం హైడ్రా పరిధిలోనే పది లక్షల కోట్ల విలువైన భూములు కబ్జాకు గురైనట్లు సమాచారం ఉందని హైడ్రా కమిషనర్ తెలిపారు. మరోవైపు జూన్ ఎనిమిదో తేదీ నుంచి హైడ్రా ప్రజావాణి కార్యక్రమం తిరిగి ప్రారంభం కానుంది. పెండింగ్ ఫిర్యాదులను ప్రాధాన్య క్రమంలో పరిష్కరించాలనే ఉద్దేశంతో నాలుగు వారాల పాటుఈ కార్యక్రమానికి విరామం ఇచ్చారు.. ప్రజావాణితో పాటు, వివిధ రూపాల్లో వచ్చిన ఫిర్యాదులన్నీ క్లియర్ చేయాలనే ఉద్దేశంతోనే ఈ విరామాన్ని ప్రకటించినట్లు తెలిపారు. అయితే గతంలో ఇచ్చిన ఫిర్యాదుదారులు అత్యవసరమని భావిస్తే కార్యాలయానికి వచ్చి నేరుగా కలవవచ్చని రంగనాథ్ తెలిపారు. అలాగే ముఖ్యమైన సమస్యలున్నా నేరుగా కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేయవచ్చునని హైడ్రా కమిషనర్ రంగనాథ్ బుధవారం రోజున ఓ ప్రకటనలో తెలిపారు.

## ఇండోనేషియాలో బద్దలైన అగ్నిపర్వతం... ముగ్గురి మృతి

ఇండోనేషియాలో మరోసారి అగ్నిపర్వతం బద్దలైంది. నార్త్ మలుకు ప్రావిన్స్‌లోని దుకోనో అగ్నిపర్వతం శుక్రవారం ఉదయం విస్ఫోటనం చెందింది. ఈ దుర్ఘటనలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయినట్లు స్థానిక పోలీసులు ధ్రువీకరించారు. పర్వతంపై చిక్కుకుపోయిన సుమారు 20 మంది పర్వతారోహకులను సురక్షితంగా తరలించేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 7:40 గంటలకు ఈ విస్ఫోటనం సంభవించింది. దీని ప్రభావంతో సుమారు 10 కిలోమీటర్ల ఎత్తు వరకు దట్టమైన బూడిద మేఘాలు ఆకాశంలోకి ఎగిసిపడ్డాయి. అగ్నిపర్వత బిలం నుంచి 4 కిలోమీటర్ల పరిధిలో ఎలాంటి కార్యకలాపాలు చేపట్టవద్దని అధికారులు ప్రజలను హెచ్చరించారు. వర్షాలు కురిస్తే అగ్నిపర్వత బురద ప్రవాహాలు (మడ్‌ఫ్లోస్) సంభవించే ప్రమాదం ఉందని కూడా హెచ్చరికలు జారీ చేశారు. దుకోనో అగ్నిపర్వతం ఈ ఏడాది ఫిబ్రవరిలో కూడా విస్ఫోటనం చెందింది. ఆ సమయంలో విమానయాన రంగానికి అధికారులు ఆరెంజ్ లెవెల్ హెచ్చరిక జారీ చేశారు. బూడిద కారణంగా శ్వాసకోశ సమస్యలు రాకుండా ఉండేందుకు ప్రజలు మాస్కులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. సముద్ర మట్టానికి 1,087 మీటర్ల ఎత్తులో ఉన్న దుకోనో, ఇండోనేషియాలోని 127 క్రియాశీల అగ్నిపర్వతాలలో ఒకటి. గత నెలలో ఇండోనేషియాలోని మౌంట్ సెమేరు అగ్నిపర్వతం కూడా పలుమార్లు విస్ఫోటనం చెందిన విషయం తెలిసిందే.

# విజయ్‌కి మళ్లీ షాకిచ్చిన గవర్నర్..

ఈ క్రమంలోనే తమకు 120 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉందని లేఖలు అందించగా.. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు గవర్నర్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు వార్తలు వచ్చాయి. దీంతో రేపు చెన్నైలోని నెహ్రూ ఇండోర్ స్టేడియంలో.. తమిళనాడు ముఖ్యమంత్రిగా విజయ్ ప్రమాణ స్వీకార మహోత్సవానికి ఏర్పాట్లు కూడా మొదలుపెట్టారు. ఇంతలోనే మరో హైడ్రామా నెలకొంది.

ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు టీవీకే చీఫ్ విజయ్‌కు గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ నుంచి ఇంకా అధికారిక ప్రకటన రాకపోవడంపై మళ్లీ రకరకాల ఊహాగానాలు నెలకొంటున్నాయి. ఇటీవలి తమిళనాడు ఎన్నికల్లో అత్యధిక స్థానాలు సాధించి.. అతిపెద్ద పార్టీగా అవతరించిన టీవీకేకు.. మొదట కాంగ్రెస్ పార్టీ మద్దతు ప్రకటించింది. ఈ క్రమంలోనే ఇవాళ సాయంత్రం సీపీఐ, సీపీఎం, వీసీకే, ఐయూఎంఎల్ పార్టీలు టీవీకే పార్టీకి మద్దతు ప్రకటించడంతో.. తాము మెజార్టీ మార్కును చేరుకున్నామని పేర్కొంటూ.. గవర్నర్‌ను కలిశారు. అయితే ఇందులో వీసీకే పార్టీ అధికారికంగా లేఖ ఇవ్వలేదని.. అందుకే లోక్‌భవన్ నుంచి అఫీషియల్ ప్రకటన రాలేదని తెలుస్తోంది.

ఈ నేపథ్యంలోనే శనివారం ఉదయం 11 గంటలకు తమిళనాడు సీఎంగా విజయ్ ప్రమాణ స్వీకారం చేస్తారని సీపీఎం నేత కె.బాలకృష్ణన్ తెలిపారు. ఈ ప్రమాణ స్వీకార మహోత్సవానికి కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ సహా కీలక నేతలు హాజరయ్యే అవకాశం ఉన్నట్లు హస్తం పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. ఈ క్రమంలోనే తాజా ట్విస్ట్‌తో అసలు విజయ్ ప్రమాణ స్వీకారం రేపు ఉంటుందా లేదా అనేది ఇప్పుడు సందిగ్ధంలో పడింది.

గవర్నర్‌తో భేటీ తర్వాత నేరుగా చెన్నైలోని సీపీఐ, సీపీఎం కార్యాలయాలకు వెళ్లిన విజయ్.. తనకు మద్దతు ప్రకటించినందుకు కమ్యూనిస్టు పార్టీల నేతలకు ధన్యవాదాలు తెలిపారు. అయితే టీవీకే పార్టీకి తాము మద్దతు తెలిపినప్పటికీ.. మంత్రివర్గంలో తాము చేరేది లేదని లెఫ్ట్ పార్టీలు స్పష్టం చేశాయి. తాము ప్రభుత్వానికి బయటి నుంచే మద్దతు ఇస్తామని తెలిపాయి. అసెంబ్లీలో విజయ్ బల పరీక్ష వేళ.. టీవీకే పార్టీకి మద్దతుగా కచ్చితంగా ఓటు వేస్తామని తేల్చి చెప్పాయి. తమిళ ప్రజలు టీవీకే పార్టీకి అధిక మెజార్టీ ఇచ్చారని.. వారి నమ్మకాన్ని నిలబెట్టేందుకు, రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు కావడం కోసమే మద్దతు ఇస్తున్నట్లు చెప్పారు.

# మూసీ సుందరీకరణకు ముహూర్తం ఫిక్స్.. తొలిదశలో రూ.7,055 కోట్లతో పనులు

మూసీ నది సుందరీకరణకు ముహూర్తం ఖరారైంది. ఈ ఏడాది ఆగస్ట్ నుంచి మూసీ ప్రాజెక్టు పనులు ప్రారంభం కానున్నాయి. మూసీ ప్రాజెక్టుపై చర్చించేందుకు కేబినెట్ సబ్ కమిటీ శుక్రవారం సమావేశమైంది. ఈ సందర్భంగా ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్ వివరాలను అధికారులు మంత్రులకు అందజేశారు. ఈ నేపథ్యంలో తొలిదశలో రూ. 7,055 కోట్లతో పనులు చేపట్టాలని నిర్ణయించారు. ఆగస్ట్ నుంచి పనులు ప్రారంభించి 2027 డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు.

మూసీ నది సుందరీకరణ దిశగా అడుగులు పడుతున్నాయి. మూసీ ప్రాజెక్టు పనులను ఈ ఏడాది ఆగస్టు నుంచి ప్రారంభించాలని నిర్ణయించారు. మూసీ నది సుందరీకరణ ప్రాజెక్టుపై తెలంగాణ ప్రభుత్వం కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ కేబినెట్ సబ్ కమిటీ శుక్రవారం సమావేశమై వివిధ అంశాలపై చర్చించింది. ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్ పరిశీలించింది. ఈ నేపథ్యంలోనే తొలిదశలో రూ. 7,055 కోట్లతో పనులు చేపట్టాలని నిర్ణయించారు. తొలి దశ పనులకు సంబంధించి ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంకుతో చర్చలు ముగిసినట్లు అధికారులు మంత్రులకు తెలియజేశారు. మరోవైపు ప్రాజెక్టు తొలిదశలో నిర్మాణాలపై ప్రభావం లేని ఐదు కిలోమీటర్ల మేరకు పనులు ప్రారంభించాలని కేబినెట్ సబ్ కమిటీ అధికారులను ఆదేశించింది. నిర్మాణాలపై తక్కువగా ప్రభావం పడేలా అలైన్‌మెంట్ మార్చాలని కేబినెట్ సబ్ కమిటీ సూచించింది. మరోవైపు ఆగస్టు నెల నుంచి పనులను ప్రారంభించి.. 2027 డిసెంబర్ నాటికల్లా పూర్తిచేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. మూసీ పునరుజ్జీవనం ప్రాజెక్టు ప్రజా భాగస్వామ్యంతోనే అమలు చేస్తామని మంత్రివర్గ ఉపసంఘం స్పష్టం చేసింది. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని, వారి ఆస్తులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా ప్రాజెక్టును రూపొందించాలని అధికారులకు స్పష్టం చేసింది. ఇందుకోసం ప్రాజెక్టు అలైన్‌మెంట్‌లో మార్పులు చేసి నిర్మాణాలపై ప్రభావం తగ్గించేలా చూడాలని అధికారులకు స్పష్టం చేసింది. మరోవైపు మొత్తం 55 కిలోమీటర్ల మేరకు మూసీ ప్రాజెక్టును చేపడుతున్నారు. 5 దశల్లో ఈ ప్రాజెక్టు పనులు జరగనున్నాయి. తొలి దశలో హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్‌ల నుంచి బాపుఘాట్ వరకూ పనులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ప్రాజెక్టులో భాగంగా మూసీ నదిలోని చెత్తను తొలగిస్తారు. రివర్ బెడ్ ప్రొఫైలింగ్ చేపడతారు. రిటైనింగ్ వాల్స్, రెండు వైపులా రహదారులు, మురుగు కాలువలు, బ్యారేజీలు, రివర్ ఫ్రంట్ అభివృద్ధి వంటి పనులు చేపడతారు. డిసెంబర్ 2027 నాటికల్లా ప్రాజెక్టును పూర్తి చేయాలని తెలంగాణ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అందుకు అనుగుణంగా చర్యలు చేపడుతోంది.

# చర్లపల్లి రైల్వే స్టేషన్‌లో యాక్సెస్ కంట్రోల్ సిస్టం..

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ తరహాలోనే చర్లపల్లి స్టేషన్‌లోనూ వాహనాల రద్దీని నియంత్రించేందుకు దక్షిణ మధ్య రైల్వే యాక్సెస్ కంట్రోల్ వ్యవస్థను అందుబాటులోకి తెస్తోంది. వాహనాల పికప్, డ్రాప్ కోసం 20 నిమిషాల వరకు ఉచిత సమయాన్ని కేటాయించగా.. ఆపై నిమిషాల ఆధారంగా రుసుము వసూలు చేయనున్నారు. డిజిటల్ టికెటింగ్, ప్రత్యేక లేన్లతో కూడిన ఈ విధానం వల్ల అనధికార పార్కింగ్‌కు చెక్ పడటంతో పాటు ప్రయాణికులకు సాఫీగా రాకపోకలు సాగించే వీలుంటుందని రైల్వే అధికారులు చెబుతున్నారు.

హైదరాబాద్ మహానగరంలో నాలుగో ప్రధాన రైల్వే టెర్మినల్‌గా అభివృద్ధి చెందుతున్న చర్లపల్లి రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం దక్షిణ మధ్య రైల్వే కీలక నిర్ణయం తీసుకుంది. స్టేషన్ ప్రాంగణంలో వాహనాల రద్దీని క్రమబద్ధీకరించడానికి, ట్రాఫిక్ జామ్ సమస్యలను నివారించడానికి అత్యాధునిక యాక్సెస్ కంట్రోల్ వ్యవస్థను అమలు చేయనుంది. ఇప్పటికే సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లోని 10వ ప్లాట్‌ఫాం వద్ద విజయవంతంగా నడుస్తున్న ఈ విధానాన్ని ఇప్పుడు చర్లపల్లికి కూడా విస్తరిస్తున్నారు. దీనివల్ల స్టేషన్ లోపలికి వచ్చే వాహనాల వివరాలు డిజిటలైజ్ చేయబడటమే కాకుండా.. అనధికారికంగా వాహనాలను నిలిపివేసే ధోరణికి అడ్డుకట్ట పడుతుందని రైల్వే అధికారులు చెబుతున్నారు.




ఈ కొత్త విధానం ప్రకారం.. బైక్, ఆటో, నాలుగు చక్రాల వాహనాలకు వేర్వేరుగా లేన్లను కేటాయించారు. స్టేషన్ ప్రాంగణంలోకి ప్రవేశించే ప్రతి వాహనానికి ప్రవేశ సమయంతో కూడిన డిజిటల్ టికెట్ జారీ చేస్తారు. ప్రయాణికులను డ్రాప్ లేదా పికప్ కోసం వచ్చే వాహనాలకు మొదటి 20 నిమిషాల వరకు ఎటువంటి రుసుము వసూలు చేయరు. అంటే 20 నిమిషాలలోపు పని ముగించుకుని బయటకు వెళ్లే వారికి 'ఫ్రీ ఎగ్జిట్' సదుపాయం ఉంటుంది. అయితే నిర్ణీత సమయం దాటిన తర్వాత డిజిటల్ రసీదు ప్రకారం ఛార్జీలు వర్తిస్తాయి. నేరుగా పార్కింగ్ స్థలాలకు వెళ్లే వాహనాలకు ఈ అదనపు ఛార్జీల నుంచి మినహాయింపు ఉంటుంది.

కమర్షియల్ వెహికల్స్ అంటే బస్సులు, మినీ బస్సులకు కూడా 20 నిమిషాల ఉచిత సమయాన్ని కల్పించారు. ఒకవేళ 20 నుండి 30 నిమిషాల మధ్య ఉంటే రూ. 100, 30 నుంచి 60 నిమిషాల వరకు ఉంటే రూ. 200 రుసుము చెల్లించాల్సి ఉంటుంది. వాహనాలను గంట కంటే ఎక్కువ సమయం లోపల ఉంచడానికి అనుమతి లేదు. ఈ నిబంధనను అతిక్రమించే వారికి రూ. 1000 వరకు భారీ జరిమానా విధించనున్నట్లు రైల్వే అధికారులు హెచ్చరించారు. ఈ కఠిన నిబంధనల వల్ల స్టేషన్ ఎంట్రన్స్ వద్ద అనవసరపు రద్దీ తగ్గి ప్రయాణికులు సకాలంలో ప్లాట్‌ఫాంలకు చేరుకునే అవకాశం ఉంటుంది.

స్టేషన్‌లో గంటల ప్రాతిపదికన వాహనాలు నిలుపుకోవాలనుకునే వారి కోసం ప్రత్యేక పార్కింగ్ రేట్లను ఖరారు చేశారు. కార్లకు మొదటి రెండు గంటలకు రూ. 20, ఆ తర్వాత ప్రతి గంటకు రూ. 10 చొప్పున వసూలు చేస్తారు. ద్విచక్ర, త్రిచక్ర వాహనాలకు మొదటి రెండు గంటలకు రూ. 15, ఆపై గంటకు రూ. 10 చొప్పున ఛార్జీ ఉంటుంది. ఈ డిజిటల్ పేమెంట్, యాక్సెస్ కంట్రోల్ విధానం ద్వారా పారదర్శకత పెరుగుతుందని, ప్రయాణికులకు మెరుగైన రవాణా అనుభూతి లభిస్తుందని దక్షిణ మధ్య రైల్వే ఒక ప్రకటనలో వెల్లడించింది.

# రియల్ ఎస్టేట్ రంగంలో టెక్నాలజీ విప్లవం.. ఏఐ వాడకంలో భారీ పెరుగుదల




భారత రియల్ ఎస్టేట్ రంగం భవిష్యత్తులో అద్భుతమైన వృద్ధిని సాధించనుందని, 2047 నాటికి ఈ మార్కెట్ విలువ ప్రస్తుతంతో పోలిస్తే దాదాపు 9 రెట్లు పెరిగి 5.8 ట్రిలియన్ డాలర్లకు (సుమారు 49 లక్షల కోట్ల రూపాయలు) చేరుకుంటుందని ఫిక్కీ–కేపీఎంజీ సంయుక్త నివేదిక అంచనా వేసింది. Reimagining Indias Real Estate Landscape పేరిట విడుదల చేసిన ఈ నివేదిక, టెక్నాలజీ వినియోగం ఈ వృద్ధికి కీలక చోదకశక్తిగా నిలుస్తుందని స్పష్టం చేసింది. రియల్ ఎస్టేట్‌లో టెక్నాలజీ విప్లవం వస్తోందని, ఏఐ వాడకంలో భారీ పెరుగుదల నమోదవుతోందని తెలిపింది.

ప్రస్తుతం 2025లో భారత రియల్ ఎస్టేట్ మార్కెట్ విలువ 650 బిలియన్ డాలర్లుగా (సుమారు 5.5 లక్షల కోట్ల రూపాయలు) ఉంది. ఇది దేశ జీడీపీలో 7.3 శాతం వాటాను కలిగి ఉంది. నగరీకరణ, పెరుగుతున్న ఆదాయాలు, సంస్థాగత పెట్టుబడులతో పాటు సాంకేతికత వినియోగం పెరగడం ఈ వృద్ధికి ప్రధాన కారణాలని నివేదిక పేర్కొంది.

రియల్ ఎస్టేట్ రంగం ఇప్పుడు సాంప్రదాయిక పద్ధతుల నుంచి డిజిటల్ వైపు వేగంగా అడుగులు వేస్తోంది. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డిజిటల్ ట్విన్స్, బ్లాక్‌చెయిన్, డ్రోన్లు వంటి టెక్నాలజీల వినియోగం పెరుగుతోంది. కార్పొరేట్ రియల్ ఎస్టేట్‌లో ఏఐ వాడకం 2023లో 5 శాతం కంటే తక్కువ ఉండగా, 2025 నాటికి అది ఏకంగా 91 శాతానికి పెరగడం గమనార్హం.

పెరుగుతున్న నిర్మాణ వ్యయాలు, కఠినమైన నియంత్రణలు, పారదర్శకత కోసం కొనుగోలుదారుల నుంచి వస్తున్న ఒత్తిడి వంటి కారణాలతో కంపెనీలు టెక్నాలజీని అందిపుచ్చుకుంటున్నాయి. 'వికసిత భారత్' లక్ష్య సాధనలో ఉపాధి కల్పన, ఆర్థిక వృద్ధికి రియల్ ఎస్టేట్ రంగం కీలక పాత్ర పోషిస్తుందని నివేదిక అభిప్రాయపడింది. వివిధ మార్గాల ద్వారా ఇప్పటికే 16 బిలియన్ డాలర్లకు పైగా మూలధనం అందుబాటులోకి రావడం కూడా ఈ రంగంలో పారదర్శకతను పెంచుతోంది.

జాతీయ దిన పత్రిక
# తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..



## ఘనంగా గొంగిడి మహేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు
**- రాజాపేటలో కేక్ కట్ చేసిన నాయకులు**

**- ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ**

**తొలివెలుగు, రాజాపేట:** ఉమ్మడి నల్గొండ జిల్లా డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం రాజాపేట మండల కేంద్రంలో నాయకులు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. మండల అధ్యక్షుడు సట్టు తిరుమలేష్ ఆధ్వర్యంలో ఈ వేడుకలను పండుగ వాతావరణంలో జరుపుకున్నారు. ముందుగా స్థానిక గాంధీ చౌరస్తా వద్దకు చేరుకున్న నాయకులు.. అక్కడ భారీ కేక్ కట్ చేసి, ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుని జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు. అక్కడ చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించి, వారికి పండ్లు పంపిణీ చేసి తమ సేవాభావాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో నాయకులు సందిల భాస్కర్ గౌడ్, చామకూర గోపాల్ గౌడ్, ఎడ్ల బాలలక్ష్మి, గుంటి మధుసూదన్ రెడ్డి, కాకల్ల ఉపేందర్, ఎర్రగోకుల జశ్వంత్, బూర్గు నర్సిరెడ్డి, బొడ్డు భాస్కర్, గోపగాని యాదగిరి గౌడ్, మేక వెంకటేశ్వర రెడ్డి, గుర్రం నరసిములు, బొంగోని ఉప్పలయ్య గౌడ్, విష్ణు, కోయ బాలరాజు, గంధమల్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## జనాభా గణనకు సహకరించండి
**- మే 11 నుంచి ప్రక్రియ ప్రారంభం**

**- ప్రజలకు తహసీల్దార్ ప్రదీప్ విజ్ఞప్తి**

**- పథకాలు రద్దు కావని స్పష్టీకరణ**



**తొలివెలుగు, రాజాపేట:** మండలంలో ఈ నెల 11వ తేదీ నుంచి జనాభా గణన ప్రక్రియ ప్రారంభం కానున్నట్లు మండల ఛార్జ్ ఆఫీసర్, తహసీల్దార్ వల్లపు ప్రదీప్ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గణన కోసం ఇంటింటికి వచ్చే ఉపాధ్యాయులకు ప్రజలు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. ఎన్యుమరేటర్లు అడిగే వివరాలకు సరైన సమాచారం అందించి ఈ ప్రక్రియను విజయవంతం చేయాలన్నారు. జనాభా లెక్కల వివరాలు ఇవ్వడం వల్ల ప్రభుత్వం నుంచి అందుతున్న సంక్షేమ పథకాలు రద్దు అవుతాయని వస్తున్న ప్రచారంలో నిజం లేదని, ఎవరూ ఆందోళన చెందవద్దని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రక్రియలో పంచాయతీ కార్యదర్శులు, గ్రామ పంచాయతీ సిబ్బంది క్రియాశీలకంగా వ్యవహరించాలని తహసీల్దార్ ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఉపాధ్యాయులకు అవసరమైన తోడ్పాటునందించాలని సూచించారు. దేశాభివృద్ధికి, మౌలిక సదుపాయాల కల్పనకు ఈ జనాభా లెక్కలే ప్రాతిపదిక అని, భవిష్యత్ ప్రణాళికల రూపకల్పనలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయని ఆయన వివరించారు.


## రాజాపేటలో ఉచిత మెగా వైద్య శిబిరం
**- మెడిసిటీ ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహణ**

**- పెద్ద సంఖ్యలో తరలివచ్చిన రోగులు**

**- శిబిరాన్ని ప్రారంభించిన సర్పంచి మధు**



**తొలివెలుగు, రాజాపేట:** మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో శుక్రవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. మేడ్చల్‌లోని మెడిసిటీ ఆసుపత్రి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని సర్పంచి కోయ మధు, ఉపసర్పంచి నమిల కేదారి గౌడ్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం ఇలాంటి శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. మెడిసిటీ ఆసుపత్రి వైద్య నిపుణులు రోగులను పరీక్షించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ శిబిరానికి గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. పేదలకు మెరుగైన వైద్యం చేరువ చేసిన ఆసుపత్రి యాజమాన్యానికి సర్పంచ్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సాయిలు, గ్రామ ప్రజలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



# ఆధ్యాత్మిక శోభతో అల్లాపురం..
# వైభవంగా బొడ్రాయి ప్రతిష్ఠ

- వేదమంత్రోచ్ఛారణల నడుమ కొలువుదీరిన ముత్యాలమ్మ, నాభిశిల
- కనులపండువగా ముత్తైదువుల 101 దీపాల పూజ
- నేడు అమ్మవార్లకు బోనాల సమర్పణ.. ఆడపడుచుల కోలాహలం
- రేపు తెల్లవారుజామున ఊరికి అష్టదిగ్బంధనం.. రాకపోకలు బంద్

**తొలివెలుగు, చౌటుప్పల్ :** మండలంలోని అల్లాపురం గ్రామం ఆధ్యాత్మిక శోభను అద్దుకుంది. ఊరి బాగోగులు చూసే బొడ్రాయి, ముత్యాలమ్మ విగ్రహాల ప్రతిష్టాపన మహోత్సవాలు కన్నుల పండువగా సాగుతున్నాయి. గురువారం నాడు ప్రారంభమైన ఈ ఉత్సవాలకు వలస వెళ్లిన వారు సైతం సొంతూరుకు చేరుకోవడంతో గ్రామంలో ఎటుచూసినా సందడి నెలకొంది. శనివారం తెల్లవారుజామున 2:25 గంటలకు అత్యంత పవిత్రమైన ముహూర్తంలో బొడ్రాయి ప్రతిష్ఠాపన మహా ఘట్టం వేద పండితుల ఆధ్వర్యంలో కోలాహలంగా ముగిసింది.

**నిరంతరాయంగా పూజా క్రతువులు:**

గురువారం ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనంతో మొదలైన వేడుకల్లో భాగంగా విగ్రహాల ఊరేగింపు భక్తిశ్రద్ధలతో సాగింది. జలాధివాసంలో గ్రామస్తులు ప్రతి ఒక్కరూ విగ్రహాలపై పాలు, బిందె నీళ్లు పోసి తరించారు. శుక్రవారం ఉదయం ధాన్యాధివాసంలో ఇంటింటి నుంచి బియ్యాన్ని అందజేశారు. శుక్రవారం సాయంత్రం ముత్తైదువులు 101 దీపాలు వెలిగించి చేసిన పూజలు సాక్షాత్తూ ఆ లక్ష్మీదేవి కొలువుదీరిందా అన్నట్లుగా సాగాయి. రాత్రి 11 గంటల సమయంలో గ్రామ శివారులో పొలిమేర కట్టు కట్టి వాహనాల రాకపోకలను నిలిపివేశారు.

**ఆడపడుచుల ఒడి బియ్యం:** బోనాల సందడి శనివారం ఉదయం నాభిశిలకు పూర్ణాహుతి నిర్వహించారు. ఊరి ఆడపడుచులు బొడ్రాయికి కొత్త బిందెలతో జలాభిషేకం చేశారు. అత్తగార్ల చేతుల మీదుగా నూతన వస్త్రాలు, ఒడి బియ్యం స్వీకరించి మురిసిపోయారు. పసుపు బట్టలు ధరించి తలపై బోనాలతో మహిళలు డప్పు వాయిద్యాల నడుమ బొడ్రాయికి ప్రదక్షిణలు చేసి గ్రామ దేవతలకు నైవేద్యం సమర్పించారు.

**ఆదివారం అసలైన ఘట్టం.. ఊరికి దిగ్బంధనం :**

ఉత్సవాల్లో చివరి రోజైన ఆదివారం (10వ తేదీ) అత్యంత కీలకమైన 'అష్టదిగ్బంధనం' నిర్వహించనున్నారు. బంధుమిత్రులతో విందు భోజనాలు ఒక ఎత్తయితే.. తెల్లవారుజామున 4 గంటలకే ఊరడి (బలి పూజ) చేసి ఊరు చుట్టూ బలి తిరుగుతారు. గ్రామానికి చెడు గాలి సోకకుండా, దృష్టి దోషాలు తొలగిపోయేలా చేసే ఈ కట్టుబాటు సమయంలో ఊరి వారు బయటకు వెళ్లడం, బయటి వారు లోపలికి రాకూడదనే కఠిన నియమాన్ని గ్రామ కమిటీ అమలు చేయనుంది. అనంతరం వసంతోత్సవం, హోమాలు ముగిసిన తర్వాత బంధుమిత్రులతో కలిసి గ్రామస్తులంతా సామూహిక విందు భోజనాల్లో పాల్గొంటారు.




## కురుమ కార్పొరేషన్ ఏర్పాటు హర్షణీయం
**- ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కృషి మరువలేనిది**

**- తుక్కాపురం మాజీ సర్పంచ్ దయ్యాల రాజు**

**తొలివెలుగు, ఆత్మకూర్(ఎం):** రాష్ట్ర ప్రభుత్వం కురుమల సంక్షేమం కోసం ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయడం పట్ల హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. కురుమ కులస్తుల దశాబ్దాల కలను సాకారం చేసేందుకు ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అహర్నిశలు శ్రమించారని తుక్కాపురం గ్రామ మాజీ సర్పంచ్ దయ్యాల రాజు కొనియాడారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గతంలో ఏ ప్రభుత్వము చేయని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం కురుమల అభివృద్ధికి పెద్దపీట వేసిందన్నారు. ముఖ్యంగా బీర్ల ఐలయ్య ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి, కురుమల సామాజిక, ఆర్థికాభివృద్ధికి కార్పొరేషన్ అత్యవసరమని ఒప్పించడంలో విజయం సాధించారని పేర్కొన్నారు. ఈ నిర్ణయం వల్ల వేలాది కురుమ కుటుంబాలకు మేలు జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కురుమ జాతి అభివృద్ధికి అండగా నిలిచిన ఎమ్మెల్యేకు ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



## డబ్బు కోసం దారుణం
## మరదలిని పొట్టనబెట్టుకున్న బావ
**- అప్పు అడిగిందని కిరాతక హత్య**

**- శ్రీశైలం లోయలో మృతదేహం దగ్ధం**

**- కాశీ యాత్రకు వెళ్లి వచ్చిన నిందితులు**



**తొలివెలుగు, సూర్యాపేట/హుజూర్ నగర్:** అప్పుగా తీసుకున్న సొమ్మును తిరిగి అడిగినందుకు ఓ బావ తన భార్యతో కలిసి మరదలిని కిరాతకంగా హత్య చేశాడు. ఎవరికీ అనుమానం రాకుండా మృతదేహాన్ని వందల కిలోమీటర్ల దూరంలోని శ్రీశైలం అడవులకు తరలించి లోయలో పడేశారు. ఈ దారుణ ఘటన సూర్యాపేట జిల్లాలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చి సంచలనం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అనంతగిరి మండలం మొగులాయి కోట గ్రామానికి చెందిన బాధితురాలు.. హుజూర్ నగర్ మండలం కాల్వపల్లికి చెందిన తన బావ గోవిందుకు గతంలో డబ్బులు అప్పుగా ఇచ్చింది. కొంతకాలంగా ఆ డబ్బుల కోసం ఆమె ఒత్తిడి తెస్తోంది. దీనిని మనసులో పెట్టుకున్న గోవిందు, తన భార్య మహాలక్ష్మితో కలిసి ఆమెను వదిలించుకోవాలని కుట్ర పన్నాడు. పక్కా పథకం ప్రకారం రాయని గూడెం సమీపంలో ఆమెను హత్య చేశారు. అనంతరం మృతదేహాన్ని కారులో శ్రీశైలం అటవీ ప్రాంతానికి తరలించి, సుమారు 200 అడుగుల లోయలో పడేసి పెట్రోల్ పోసి నిప్పంటించారు. హత్య తర్వాత ఏమీ తెలియనట్టు నిందితులు కాశీ యాత్రకు వెళ్లి వచ్చారు. నిందితుల కదలికలపై అనుమానం వచ్చిన పోలీసులు తమదైన శైలిలో విచారించగా అసలు నిజం బయటపడింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కుటుంబ బంధాల కంటే డబ్బే ఎక్కువని భావించి చేసిన ఈ హత్య సూర్యాపేట జిల్లాలో సంచలనం సృష్టించింది.



## నాయి బ్రాహ్మణుల పట్ల వివక్ష తగదు
**- కార్పొరేషన్ పదవుల్లో చోటు కల్పించకపోవడంపై నిరసన**

**- జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వేముల బిక్షం**

**తొలివెలుగు, ఆత్మకూర్(ఎం):** రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్ పదవుల్లో నాయి బ్రాహ్మణులకు చోటు కల్పించకపోవడంపై యాదాద్రి భువనగిరి జిల్లా నాయి బ్రాహ్మణ సేవా సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ వేముల బిక్షం అభ్యంతరం వ్యక్తం చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయి బ్రాహ్మణ కార్పొరేషన్‌ను విస్మరించడం ఆ వర్గాన్ని తీవ్ర నిరాశకు గురిచేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. నాయి బ్రాహ్మణుల సమస్యలపై గతంలో అనేకసార్లు విన్నవించినా ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన లేకపోవడం శోచనీయమన్నారు. ఎన్నికల వేళ తమ వృత్తిని కొనియాడిన ముఖ్యమంత్రి, అధికారంలోకి వచ్చాక ఆ వర్గం సంక్షేమాన్ని విస్మరించారని విమర్శించారు. వెంటనే ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి, అదే వర్గానికి చెందిన వ్యక్తిని ఛైర్మన్‌గా నియమించాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక బడ్జెట్ కేటాయించి నేరుగా లబ్ధిదారులకు అందేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బండి నరేష్, టౌన్ అధ్యక్షుడు బలరాము, దుర్గయ్య, నరసింహ, చందు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ దిన పత్రిక
# తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..



## ఎస్బీఐ ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరించాలి

**- మే 25, 26 తేదీల్లో దేశవ్యాప్త సమ్మె**

**- రీజినల్ సెక్రటరీ అయితగొని మహేష్**

**తొలివెలుగు, సూర్యాపేట:** స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) ఉద్యోగుల సమస్యలను యాజమాన్యం తక్షణమే పరిష్కరించాలని ఎస్బీఐ రీజినల్ సెక్రటరీ అయితగొని మహేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత మూడు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న మెసెంజర్ల నియామకాలు చేపట్టాలని, అలాగే ఆర్మ్‌డ్ గార్డుల భర్తీని తక్షణమే పూర్తి చేయాలని కోరారు. బ్యాంకింగ్ రంగంలో పెరుగుతున్న ఔట్‌సోర్సింగ్ విధానాన్ని నిలిపివేసి, శాశ్వత ప్రాతిపదికన సిబ్బందిని నియమించాలన్నారు. ఎన్పీఎస్ ఉద్యోగులకు పెన్షన్ ఫండ్ మేనేజర్లను మార్చుకునే వెసులుబాటు కల్పించాలని, మెడికల్ రీయింబర్స్‌మెంట్, హెచ్ఆర్ఎంఎస్ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఉద్యోగుల బదిలీలు, కెరీర్ ప్రోగ్రెషన్ స్కీమ్ విషయంలో పారదర్శకత పాటించాలన్నారు. తమ డిమాండ్ల సాధనకై ఫెడరేషన్ పిలుపు మేరకు మే 25, 26 తేదీల్లో నిర్వహించనున్న రెండు రోజుల దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఉద్యోగులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సురేష్, హేమలత, నవీన్, క్రాంతి, కిషోర్, ప్రియాంక, చందు, కిరణ్, నవ్య, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

## మోదీ సభను విజయవంతం చేయండి

**- భాజపా జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేష్ బాబు పిలుపు**

**- కోదాడలో సన్నాహక సమావేశం**



**తొలివెలుగు, కోదాడ:** ఈ నెల 10న హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బహిరంగ సభను భారీ సంఖ్యలో తరలివెళ్లి విజయవంతం చేయాలని భాజపా సూర్యాపేట జిల్లా ఉపాధ్యక్షుడు మల్లెబోయిన వెంకటేష్ బాబు కోరారు. శుక్రవారం పట్టణంలోని పార్టీ రాష్ట్ర నాయకుడు మల్లెబోయిన అంజి యాదవ్ నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా మోదీ గాలి వీస్తోందని, తెలంగాణలోనూ పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. 'దేశం కోసం మోదీ – మోదీ కోసం మనం' అనే నినాదంతో ముందుకు సాగాలన్నారు. ఆదివారం జరిగే ఈ బహిరంగ సభ రాష్ట్ర రాజకీయాల్లో కీలక మార్పులకు నాంది పలుకుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో భాజపా రాష్ట్ర నాయకులు బొలిశెట్టి కృష్ణయ్య, నూనె సులోచన, కోదాడ మండల అధ్యక్షుడు గాదరి పుల్లారావు, అనంతగిరి మండల అధ్యక్షుడు చింతకుంట్ల సతీష్, నాయకులు ఓరుగంటి పురుషోత్తం, చిలుకూరు శ్రీనివాసరావు, జల్లా జనార్ధన్ రావు, భూమ శ్రీను, రమేష్ నాయక్, మారుతి కొండయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## పేద యువతి వివాహానికి లక్ష రూపాయల ఆర్థిక సహాయం

**- అండగా నిలిచిన కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్**

**- మున్సిపాలిటీలో చెక్కు అందజేసిన కాంగ్రెస్ నాయకులు**

**తొలివెలుగు, చౌటుప్పల్:** నిరుపేద కుటుంబాలకు అండగా నిలవడంలో కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఎల్లప్పుడూ ముందుంటుందని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డుకు చెందిన పోతగాని శివ సోదరి మనిషా వివాహం సందర్భంగా, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆదేశాల మేరకు ఫౌండేషన్ తరపున లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని శుక్రవారం అందజేశారు. లక్ష రూపాయల చెక్కును మనిషా కుటుంబ సభ్యులకు అందజేసిన అనంతరం వారు మాట్లాడుతూ.. రాజగోపాల్ రెడ్డి నియోజకవర్గంలోని పేద ప్రజల కష్టాలను తన కష్టాలుగా భావించి సహాయం అందిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుర్వి నరసింహ గౌడ్, 14వ వార్డు కౌన్సిలర్ ఊడుగు జ్యోతి రమేష్ గౌడ్, కో–ఆప్షన్ సభ్యులు సందగళ్ళ విజయ సతీష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# యమపాశంలా గ్రానైట్ లారీలు.. నిబంధనలు బేఖాతరు!

**- చౌటుప్పల్ - వలిగొండ రహదారిపై మృత్యుశకటాల విహారం**

**- గుంతల రోడ్డుపై గుండె పిండే ప్రయాణం**

**- ఎలాంటి రక్షణ లేకుండా భారీ శిలల రవాణా**

**- మృత్యు గర్తాల రోడ్డుపై భారీ శిలల ఊగిసలాట**

**- ఏ క్షణమైనా రాలిపడేలా భారీ శిలలు**


**- నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న అధికారులు**

**తొలివెలుగు, చౌటుప్పల్:** చౌటుప్పల్ నుంచి వలిగొండ వెళ్లే ప్రధాన రహదారిపై గ్రానైట్ లారీలు ప్రజలకు యమపాశంలా మారుతున్నాయి. నిబంధనలను పూర్తిగా పక్కనపెట్టి భారీ గ్రానైట్ శిలలను ఎలాంటి భద్రతా చర్యలు లేకుండా తరలిస్తుండటంతో వాహనదారులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా భారీ బరువుతో ప్రయాణిస్తున్న ఈ లారీలకు సరైన ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌లు, అనుమతి పత్రాలు కూడా లేవని స్థానికుల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. చౌటుప్పల్ – వలిగొండ రహదారి ఇప్పటికే అడుగడుగునా గుంతలతో అధ్వానంగా మారింది. ఇలాంటి పరిస్థితుల్లో భారీ గ్రానైట్ రాళ్లతో వెళ్తున్న లారీలు గుంతల్లో పడినప్పుడల్లా శిలలు ఊగిసలాడుతూ కిందపడేలా కనిపిస్తున్నాయని ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. నిబంధనల ప్రకారం భారీ రాళ్లను రవాణా చేసే సమయంలో ప్రత్యేక భద్రతా కవచాలు, బిగింపు పరికరాలు తప్పనిసరిగా ఉండాలి. కానీ చాలా లారీల్లో అలాంటి జాగ్రత్తలు కనిపించడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఇక లారీల వేగానికి రోడ్డుపై దుమ్ము మేఘాల్లా ఎగసిపడుతుండటంతో ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వెనుక నుంచి వచ్చే వాహనాలకు దారి సరిగా కనిపించక ప్రమాదాలకు దారితీస్తోందని, ముఖ్యంగా రాత్రి వేళల్లో ఈ రహదారిపై ప్రయాణం మరింత ప్రమాదకరంగా మారుతోందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భారీ రాళ్లు ఎప్పుడు జారి పడతాయోనన్న భయంతో ఈ మార్గంలో ప్రయాణం గుండె పిండేలా మారిందని అంటున్నారు. జాతీయ



రహదారిపై పోలీసులు, రవాణా శాఖ అధికారులు నిత్యం తనిఖీలు నిర్వహిస్తున్నప్పటికీ, నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న ఈ గ్రానైట్ రవాణాపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పత్రాలు లేని వాహనాలను సీజ్ చేసి, అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఇక చౌటుప్పల్ – వలిగొండ రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించి దాదాపు సంవత్సరం గడిచినా ఇప్పటివరకు 10 శాతం పనులు కూడా పూర్తికాలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు పనుల ఆలస్యం వల్లే ప్రమాదాలు మరింత పెరుగుతున్నాయని పేర్కొంటున్నారు. అధికారులు వెంటనే స్పందించి అక్రమ గ్రానైట్ రవాణాను అరికట్టడంతో పాటు, రోడ్డు విస్తరణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని స్థానిక ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.





# అభయాంజనేయ స్వామి సన్నిధిలో ప్రతిష్ఠా మహోత్సవం





**- వైభవంగా ధ్వజస్తంభ, విగ్రహాల ప్రతిష్ఠ**

**- భక్తుల మంత్రోచ్చారణల మధ్య ద శాస్త్రోక్తంగా పూజలు**

**- ముగిసిన మూడు రోజుల ఉత్సవాలు**

**తొలివెలుగు, రాజాపేట:** రాజాపేట మండల కేంద్రంలోని శ్రీ అభయాంజనేయ స్వామి వారి ఆలయం ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లింది. మూడు రోజులుగా అత్యంత వైభవంగా సాగుతున్న ధ్వజస్తంభ, సూర్యనారాయణ మూర్తి, సంతాన నాగేంద్ర స్వామి విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవాలు శుక్రవారంతో ఘనంగా ముగిశాయి. ఆలయ అర్చకులు చలివేదుల రాజేశ్వర శర్మ ఆధ్వర్యంలో ఉదయం 10:54 గంటలకు మంత్రోచ్ఛారణలు, మేళతాళాల మధ్య శాస్త్రోక్తంగా ప్రతిష్ఠా కార్యక్రమాన్ని నిర్వహించారు. జోషి మల్లికార్జున శర్మ బృందం వైదిక క్రతువులను జరిపించారు.

**భక్తిశ్రద్ధలతో విశేష పూజలు:** ముగింపు రోజైన శుక్రవారం ఉదయం దేవతా పూజ, గురు వందనం, హోమం, గర్తన్యాసం, యంత్ర ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం విగ్రహ ప్రతిష్ఠ, బలిహరణం, పూర్ణాహుతి జరిపారు. మహదాశీర్వచనం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షులు సోమసాని రాజమల్లయ్య, అధ్యక్షులు బెడిద నర్సింలు, జిల్లా పెరిక సంఘం అధ్యక్షులు మేడిశెట్టి సత్యనారాయణ దంపతులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. భక్తుల జయజయధ్వానాల మధ్య రాజాపేట గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ఈ ఉత్సవాలను



విజయవంతం చేసిన దాతలకు, సేవకులకు అర్చకులు కృతజ్ఞతలు తెలిపారు.

# పాడి రైతులకు లాభసాటి చిట్కాలు

**- రేణికుంటలో పశువుల గర్భకోశ చికిత్స శిబిరం**

**- ముచ్చటగొల్పిన దూడల ప్రదర్శన**

**- పశువుల పెంపకంలో మెళకువలు వివరించిన ఏడీ మోతిలాల్**

**తొలివెలుగు, రాజాపేట:** పాడి రైతులు పశువుల పోషణలో శాస్త్రీయ పద్ధతులు పాటించడం ద్వారా అధిక లాభాలు గడించవచ్చని జిల్లా పశువైద్య, పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకులు డాక్టర్ ఎన్. మోతిలాల్ సూచించారు. శుక్రవారం మండలంలోని రేణికుంట గ్రామంలో 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక'లో భాగంగా రైతు వారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉచిత గర్భకోశ చికిత్స శిబిరాన్ని ప్రారంభించి, దూడల ప్రదర్శనను తిలకించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పశువు ఈనిన మూడు నెలల లోపే చూలు కట్టేలా జాగ్రత్త పడాలన్నారు. ఒక్క ఎదకాలం వృథా అయినా రైతుపై రూ. 16 వేల అదనపు భారం పడుతుందని హెచ్చరించారు.



**వేసవిలో జాగ్రత్తలు అవసరం:**

ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉన్నందున ఉదయం, సాయంత్రం వేళల్లోనే పశువులను మేతకు తీసుకెళ్లాలని డాక్టర్ మోతిలాల్ తెలిపారు. పాకల చుట్టూ చెట్లు పెంచి, పైన తుంగ లేదా చొప్ప కప్పడం ద్వారా ఉష్ణోగ్రతల నుంచి రక్షణ కల్పించవచ్చన్నారు. లింగ నిర్ధారణ వీర్య దానం ద్వారా 90 శాతం ఆడ దూడలే పుట్టే అవకాశం ఉందని, దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ కర్రే వెంకటేశం, మండల పశువైద్యాధికారి చంద్రారెడ్డి, సిబ్బంది రవి, సిద్దులు, శ్రీకాంత్, భానుచందర్, బాల కిషన్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ దిన పత్రిక
# తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..



## పోరాటాలతోనే ప్రజా సమస్యల పరిష్కారం

**- ఈ నెల 12న సీపీఎం జిల్లా విస్తృత స్థాయి సమావేశం**

**- కరపత్రం విడుదల చేసిన బూర్గు కృష్ణారెడ్డి**

**తొలివెలుగు, చౌటుప్పల్:** ప్రజలు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యల పరిష్కారం కోసం సీపీఎం నిరంతరం పోరాడుతుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బూర్గు కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం చౌటుప్పల్‌లో సీపీఎం మున్సిపల్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా విస్తృత స్థాయి సమావేశ కరపత్రాన్ని ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఇంటింటికీ సీపీఎం', 'పోరుబాట' కార్యక్రమాల ద్వారా అనేక ప్రజా సమస్యలు వెలుగులోకి వచ్చాయన్నారు. వాటన్నింటిపై సమగ్ర చర్చ జరిపి, భవిష్యత్ పోరాట కార్యాచరణను రూపొందించడానికి ఈ నెల 12న చౌటుప్పల్‌లోని గట్టు శ్రీరాములు ఫంక్షన్ హాల్‌లో జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. గ్రామాల్లో, మున్సిపాలిటీల్లో నెలకొన్న మౌలిక వసతుల కొరతపై ప్రభుత్వం దృష్టి సారించే వరకు ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఎండి పాషా, మున్సిపల్ కార్యదర్శి గోశిక కరుణాకర్, నాయకులు బండారు నరసింహ, బత్తుల దాసు, దండ అరుణ్ కుమార్, గోపగోని లక్ష్మణ్, పర్ని ధర్మారెడ్డి, తూర్పునూరు మల్లేశం, బోయ యాదయ్య, అంతటి అశోక్, కొండే శ్రీశైలం, సప్పిడి శ్రీనివాసరెడ్డి, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి పనుల వద్ద వసతులు కల్పించాలి

**- రామన్నపేట ఎంపీడీవో రాములు - ఎండల దృష్ట్యా కూలీలకు జాగ్రత్తలు**



**తొలివెలుగు, రామన్నపేట:** మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీవో రాములు శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున ఉపాధి పనుల వద్ద కూలీలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. పని ప్రదేశాల్లో మంచినీటి సౌకర్యంతో పాటు, విశ్రాంతి తీసుకోవడానికి నీడ కల్పించేలా తగిన ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. అనంతరం కూలీలనుద్దేశించి మాట్లాడుతూ.. ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మధ్యాహ్నం వేళలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున, పనులను త్వరగా ముగించుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ హరికృష్ణ, ఈసీ ప్రవీణ్, ఫీల్డ్ అసిస్టెంట్ మమత తదితరులు పాల్గొన్నారు.

## గులాబీ శ్రేణుల కోలాహలం.. గొంగిడి బర్త్ డే సంబరాలు

**- అంబరాన్నంటిన మాజీ డీసీసీబీ చైర్మన్ జన్మదిన వేడుకలు**

**- ఆత్మకూర్(ఎం)లో పార్టీ శ్రేణుల హంగామా**

**- ముక్కోణపు పోటీలో గొంగిడి సేవలు మరువలేనివని ప్రశంస**

**- రైతు నేతకు ఘన నివాళి.. కేక్ కట్ చేసిన చందర్ గౌడ్**



**తొలివెలుగు, ఆత్మకూర్(ఎం):** ఉమ్మడి నల్గొండ జిల్లా డీసీసీబీ మాజీ చైర్మన్, టెస్కాబ్ వైస్ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు మండల కేంద్రంలో ఘనంగా జరిగాయి. శుక్రవారం మండల పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బీసు చందర్ గౌడ్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చందర్ గౌడ్ మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతిగా, రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గొంగిడి మహేందర్ రెడ్డి అందిస్తున్న సేవలు కొనియాడదగినవన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బీసు ధనలక్ష్మి చందర్ గౌడ్, రాఘవపురం సర్పంచ్ ఎరుకల యశ్వంత్ గౌడ్, మాజీ ఎంపీటీసీ యాస కవిత ఇంద్రారెడ్డి, జిల్లా నాయకులు యాస ఇంద్రారెడ్డి, కోరే బిక్షపతి పాల్గొన్నారు. ఇంకా ఆత్మకూర్ పట్టణ వార్డు సభ్యులు గడ్డం సతీష్, గట్టు విశాల్, మండల నాయకులు నాతి రాజు గౌడ్, గట్టు శంకర్, రంగ సత్యనారాయణ, కొండపల్లి అబ్బసాయిలు, కూరెళ్ల వినయ్, బోడిగే వెంకటయ్య, బొక్క వెంకట్ రెడ్డి, గార్ధసు లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

# మంత్రాల నెపంతో హత్య.. నలుగురికి యావజ్జీవం

**- హుజూర్ నగర్ కోర్టు సంచలన తీర్పు**

**- పదేళ్ల క్రితం గరిడేపల్లి మండలంలో ఘటన**

**- నేరం చేస్తే శిక్ష తప్పదన్న ఎస్పీ కె. నరసింహ**

**తొలివెలుగు, సూర్యాపేట:** భూవివాదాలు, మంత్రాల నెపంతో పదేళ్ల క్రితం జరిగిన ఓ హత్య కేసులో నలుగురు నిందితులకు యావజ్జీవ కారాగార శిక్ష పడింది. హుజూర్ నగర్ రెండవ అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి ఈ మేరకు సంచలన తీర్పు వెలువరించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ శుక్రవారం విలేకరులకు వెల్లడించారు.

కేసు పూర్వాపరాలు:

గరిడేపల్లి మండలం పొనుగోడు గ్రామానికి చెందిన యెడిపాల వీరారెడ్డి, యెడిపాల లింగారెడ్డి కుటుంబాల మధ్య కొంతకాలంగా భూవివాదాలు ఉన్నాయి. తరచూ ఇరువర్గాలు ఘర్షణ పడేవారు. ఈ క్రమంలో లింగారెడ్డి కుమారుడు అనారోగ్యం బారిన పడ్డాడు. ఇందుకు వీరారెడ్డి చేస్తున్న మంత్రాలే కారణమని లింగారెడ్డి కుటుంబం కక్ష పెంచుకుంది. 2015 జూలై 19వ తేదీ సాయంత్రం 5 గంటల సమయంలో పొలానికి వెళ్లిన వీరారెడ్డి అదృశ్యమయ్యాడు. మరుసటి రోజు కుమారుడు



వీర భాస్కర్ రెడ్డి ఫిర్యాదు మేరకు గరిడేపల్లి పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. జులై 21న ఓ రిజర్వాయర్ లో గోనెసంచిలో కుక్కిన వీరారెడ్డి మృతదేహం లభ్యం కావడంతో కేసును హత్యగా మార్చారు.

**పకడ్బందీగా దర్యాప్తు:** అప్పటి హుజూర్ నగర్ సీఐ పారదర్శకంగా దర్యాప్తు చేపట్టి, హత్యకు పాల్పడిన యెడిపాల లింగారెడ్డి, యెడిపాల సత్యనారాయణ రెడ్డి, యెడిపాల ఉపేందర్ రెడ్డి, యెడిపాల సైదిరెడ్డిలను అరెస్టు చేశారు. వారి నుంచి రెండు బైకులు, రెండు ఇనుప రాడ్లు, హెక్సా బ్లేడ్, రాయి, పారను స్వాధీనం చేసుకున్నారు. పకడ్బందీగా ఆధారాలు సేకరించి కోర్టులో నేరాభియోగ పత్రాలు దాఖలు చేశారు.

**తాజాగా తీర్పు:** ఈ కేసులో 16 మంది సాక్షులను కోర్టు విచారించింది. కోదాడ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, హుజూర్ నగర్ సీఐ చరమంద రాజు పర్యవేక్షణలో గరిడేపల్లి ఎస్ఐ నరేష్, కోర్టు కానిస్టేబుళ్లు సైదులు, రాము.. సాక్షులను సక్రమంగా కోర్టులో ప్రవేశపెట్టారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ బొబ్బ కోటిరెడ్డి బలమైన వాదనలు వినిపించారు. సాక్ష్యాధారాలు నిర్ధారణ కావడంతో నలుగురు నిందితులకు జీవిత ఖైదుతో పాటు, ఒక్కొక్కరికి రూ.1500 (మొత్తం రూ.6000) జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా మరో 45 రోజుల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ నరసింహ మాట్లాడుతూ.. చట్టాలు బలోపేతమయ్యాయని, నిందితులు ఏనాటికైనా చట్టం ముందు శిక్ష అనుభవించక తప్పదని హెచ్చరించారు.

# పశు సంపద రక్షణకు ప్రాధాన్యమివ్వాలి





**- జైకేసారంలో పశువుల పునరుత్పత్తి ఉత్పాదకత శిబిరం**

**- సబ్సిడీపై పశుగ్రాస విత్తనాల పంపిణీ**

**- మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య**

**తొలివెలుగు, చౌటుప్పల్:** పాడి రైతులు శాస్త్రీయ పద్ధతులు పాటించి పశు సంపదను వృద్ధి చేసుకోవాలని చౌటుప్పల్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య సూచించారు. శుక్రవారం చౌటుప్పల్ మండలం జైకేసారంలో 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యక్రమంలో భాగంగా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువుల పునరుత్పత్తి ఉత్పాదకత శిబిరాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ సమ్మిరెడ్డి భారతమ్మ జనార్ధన్ రెడ్డి, సింగిల్ విండో వైస్ చైర్మన్ చెన్నగోని అంజయ్యతో కలిసి ఆయన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారులు ఆవులు, గేదెలకు గర్భకోశ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం దూడలకు నట్టల నివారణ మందులు వేసి, వాటి సంరక్షణపై అవగాహన కల్పిస్తూ 'కాఫ్ ర్యాలీ' నిర్వహించారు. పాడి పరిశ్రమ ప్రోత్సాహకంలో భాగంగా రైతులకు 75 శాతం సబ్సిడీపై పశుగ్రాస విత్తనాలను అందజేశారు. వేసవిలో పశువులకు వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను డాక్టర్లు వివరించారు. కార్యక్రమంలో మిల్క్ సొసైటీ చైర్మన్ డిల్లి శేఖర్ రెడ్డి, ఉపసర్పంచ్ బోదాసు స్వాతి, పశువైద్యాధికారులు డాక్టర్ శ్రీధర్ రెడ్డి, డాక్టర్ పృథ్వీ రాజ్, వార్డు సభ్యులు రజిత, పాడి రైతులు పాల్గొన్నారు.

# లింగోజిగూడెంలో నూతన ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం





**- విద్యుత్ సమస్యల పరిష్కారమే ధ్యేయం**

**- పాల్గొన్న మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, మున్సిపల్ చైర్మన్ మొగుదాల పావని రమేష్ గౌడ్**

**తొలివెలుగు, చౌటుప్పల్:** మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెంలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు ముందడుగు వేశారు. శుక్రవారం ఉదయం గ్రామంలో కొత్తగా ఏర్పాటు చేసిన కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్‌ను వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, మున్సిపల్ చైర్మన్ మొగుదాల పావని రమేష్ గౌడ్, స్థానిక కౌన్సిలర్ పల్లె లావణ్య సురేందర్ రెడ్డిలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు అనుగుణంగా, లో-వోల్టేజీ సమస్య తలెత్తకుండా ఈ నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో సింగిల్ విండో వైస్ చైర్మన్ చెన్నగోని అంజయ్య, మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షుడు సుర్వి నర్సింహ గౌడ్, 2వ వార్డు కౌన్సిలర్ పోలెపల్లి లక్ష్మి ముత్తయ్య పాల్గొన్నారు. విద్యుత్ శాఖ ఏఈ సతీష్, లైన్‌మెన్ హుస్సేన్ అధికారులతో పాటు కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

# నిరుద్యోగుల పాలిట ఆశాదీపం కుంభం ఫౌండేషన్

**జాబ్ మేలకు భారీ స్పందన కుంభం కీర్తిరెడ్డి కృషి అభినందనీయం**




**తొలివెలుగు, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో శుక్రవారం రోజు కుంభం ఫౌండేషన్ ఆధ్వర్యంలో వన్ మిలియన్ వన్ బిలియన్ సంస్థ సహకారంతో నిర్వహించిన జాబ్ మేళా కార్యక్రమంలో కుంభం పౌండేషన్ చైర్మన్ కీర్తి రెడ్డిని పోత్నక్ ప్రమోద్ కుమార్ ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా కుంభం ఫౌండేషన్ చైర్మన్ కుంభం కీర్తి రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి నల్లగొండ జిల్లా భువనగిరి నియోజవర్గంలో ఉన్న విద్యార్థులు యువకులు నిరుద్యోగులు కోసం ఈ జాబ్ మేళా నిర్వహించడం ఎంతో సంతోషకరంగా ఉందని శుక్రవారం రోజు ఈ జాబ్ మేళాలో సుమారు 2000 మంది యువతీ యువకులు పాల్గొని వాళ్లకు సంబంధించిన విద్యార్హత సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకొని సుమారు 20 కంపెనీలతో ఈ నెల 10వ తేదీన నిర్వహించే ఇంటర్వ్యూలలో విద్యార్థుల యువకులు నిరుద్యోగుల కమ్యూనికేషన్ స్కిల్స్ ద్వారా మరియు వాళ్ళ విద్యా అర్హతల ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. ఈ ప్రాంతంలో ఎంతో మంది నిరుపేద కుటుంబాలకు సంబంధించిన విద్యార్థుల కోసం యువకుల కోసం నిరుద్యోగుల కోసం ఈ జాబ్ మేళా ఎంతో సువర్ణ అవకాశంగా ఉపయోగపడుతుందని అన్నారు. న్యూ డైమెన్షన్స్ హై స్కూల్లో భారీ ఎత్తున నిరుద్యోగ యువకులకు ఉద్యోగాలు కల్పించడం కోసం వాళ్ళ స్కిల్స్ ను పలు కంపెనీల ముందట విద్యార్హత సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం భారీ ఎత్తున ఏర్పాట్లను చేయడం జాబ్ మేళా కోసం వచ్చిన నిరుద్యోగులు యువకులు విద్యార్థుల తల్లిదండ్రులకు భోజనాలు మంచినీటి వసతి అనేక మౌలిక వసతులు కల్పించడం జరిగింది. ఇంత పెద్ద ఎండాకాలం ఉన్నప్పటికీ కూడా నిరుద్యోగ యువకులు విద్యార్థులు ఎంత పెద్ద ఎత్తున భారీగా రిజిస్ట్రేషన్ చేసుకోవడం నిరుద్యోగ సమస్య తీవ్రత తెలుస్తుందని ప్రభుత్వాలు అన్ని రకాల ఉద్యోగాలు కల్పించలేదు కల్పించడం సాధ్యం కాదు కాబట్టి నిరుద్యోగ పాలిట కుంభం పౌండేషన్ చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ కౌన్సిలర్ లయిక్ అహ్మద్ మదర్ పాషా బబ్లు పడిగేల ప్రదీప్ ఎలిమినేటి కృష్ణారెడ్డి మాటూరు బాలేశ్వర్ పిట్టల బాలరాజ్ వస్తువుల స్థాయి పుట్ట శివ సందీప్ వెంకటేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.